



సోమశిల కృష్ణానదిలో ఉన్న ఏసీ లాంచీ

కృష్ణమ్మ ఒడిలో.. అందాల విందు

- -26 నుంచి సోమశిల టు శ్రీశైలం ఏసీ లాంచి ప్రయాణానికి సిద్ధం
- - తెలంగాణ టూరిజం శాఖ వెల్లడి

- వివరాలు 7వ పేజీలో..

గవర్నర్‌ను కలిసిన పీయూ వీసీ

పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ రాష్ట్ర గవర్నర్ కులపతి జిష్ణు దేవ్‌వర్మను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి, కృతజ్ఞతలు తెలిపారు.

- పాలమూరు యూనివర్సిటీ (ఆంధ్రజ్యోతి)



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీయూ వీసీ శ్రీనివాస్

కదిలిన యంత్రాంగం

మట్టి దందాపై విచారణకు ఆదేశించిన కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): అలంపూర్ చౌరస్తా సమీపంలోని వెంచర్లకు అక్రమంగా తరలిస్తున్న మట్టిరవాణపై కలెక్టర్ స్పందించారు. ఈ విషయంపై 'మట్టి దందా ఏపీ టు తెలంగాణ' అనే కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ నెల 20న ప్రచురితమైంది. ఇందుకు కలెక్టర్ సంతోష్ స్పందించారు. విచారణ చేయాల్సిందిగా మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం మైనింగ్‌శాఖ సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఉండవల్లి ఆర్‌ఐ వాణిలతో కలిసి సదరు వెంచర్‌ను పరిశీలించారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఉండవల్లి తహసీల్దారు హరికృష్ణ తెలిపారు.



మట్టి తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దుఃఖించాలా? ఆనందించాలా?

- విపత్కర పరిస్థితిని ఎదుర్కొన్న మహిళ
- రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన భర్త
- ఆ తర్వాత గంట సేపటికే మగ బిడ్డకు జన్మ

7



కొత్తకోట శివ (ఫైల్)



జన్మించిన మగ శిశువు

శెభాష్ జయమ్మ

- ఉత్తమ పోలీస్ రిసెప్షనిస్ట్‌గా ఎంపిక



రిసెప్షనిస్ట్‌గా విధుల్లో జయమ్మ

6



జేఎన్‌టీయూ తరగతులు నిర్వహిస్తున్న పీయూ పీజీ సెంటర్

జేఎన్‌టీయూ చెంత..
సమస్యల చింత

- మూడో బ్యాచ్ ప్రారంభమైనా శాశ్వత భవనం లేక ఇక్కట్లు
- అరొకర వసతుల మధ్య పీయూ పీజీ సెంటర్‌లో చదవులు
- వసతి గృహాల్లో ఇరుకు గదులు, అధ్వానంగా భోజనం
- 900 మంది విద్యార్థులకు గాను 300 మందికే హాస్టల్ వసతి
- ల్యాబ్‌లు, వర్క్‌షాపులు లేక ప్రాక్టికల్స్‌కు ఇబ్బందులు

మహబూబ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా తయారైంది వనపర్తి జేఎన్‌టీయూ (జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ) పరిస్థితి. ఉన్నత విద్యా సంస్థలో సీటు దక్కిందని సంతోషపడాలో.. లేక ఎలాంటి సౌకర్యాలు లేని చోట సీటు వచ్చిందని బాధపడాలో తెలియని స్థితిలో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. తరగతులు సరిపోక, ల్యాబులు.. వర్క్‌షాప్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ వసతి అందరికీ లేకపోగా, ఉన్నవారికి వసతుల నుంచి ఆహారం వరకు అధ్వానంగా ఉండటంతో అధ్వానంగా మారింది. రెండేళ్ల నుంచి ఇబ్బందుల నడుమ చదువులు నెట్టుకొస్తున్న స్టూడెంట్స్.. భరించలేక మంగళవారం రోడ్డెక్కారు. సమస్యల పరిష్కారం కోసం రోడ్డును దిగ్బంధించి దాదాపు ఐదారు గంటలపాటు బైఠాయించారు. అయితే ఇంకా వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరకాలంటే చాలా ఏళ్లు ఆగక తప్పని

- మిగతా 6వ పేజీలో..

రెండేళ్లుగా భరిస్తున్నాం..



ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభమై ప్రస్తుతం మూడో బ్యాచ్ విద్యార్థులు వచ్చారు. మేము రెండు సంవత్సరాలుగా తరగతులను కష్టాల మధ్య కొనసాగిస్తున్నాం. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా కొద్ది మాకు ఇబ్బందులు కూడా రెట్టింపవుతున్నాయి. కాలేజీలో తరగతుల నుంచి మొదలుకుని ల్యాబుల వరకు అస్తవ్యస్తంగా పరిస్థితి ఉంది. హాస్టల్‌లలో చెప్పుకోలేని సమస్యలు చాలా ఉన్నాయి.

- ఇందు, సీఎస్ఈ మూడో సంవత్సరం

ఆహారంలో వెంట్రుకలు



హాస్టల్‌లో నాణ్యమైన భోజనం అందించడం లేదు. భోజనం చేసేటప్పుడు పప్పు, సాంబార్‌లో వెంట్రుకలు, బొద్దింకలు కనిపిస్తున్నాయి. వనపర్తిలో యూనివర్సిటీ కాలేజీ గొప్పగా ఉంటుందని వచ్చాం. కానీ ఇక్కడ చూస్తే అవేమీ కనిపించడం లేదు. ఆహారం సరిగా లేక అనారోగ్యానికి గురవుతున్నాం. ఎన్నిసార్లు చెప్పినా సమస్యలు తీరడం లేదు.

- అరవింద్, సీఎస్ఈ రెండో సంవత్సరం

లోపలి పేజీల్లో..



వరికి దోమ పోటు

- కురుస్తున్న వర్షాలు.. వేధిస్తున్న తెగుళ్లు
- మందులు పిచికారి చేస్తున్నా అదుపుకాని వైరస్
- ఆందోళనలో అన్నదాతలు

7



ముడా చైర్మన్ లక్ష్మణ్‌ను కుర్చీలో కూర్చోబెట్టిన మంత్రి, ఎమ్మెల్యేలు

అప్పులు చేసి చిప్ప చేతికిచ్చారు

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ముడాకు విస్తృత అధికారాలు, నిధులు : పాలమూరు ఎమ్మెల్యే యెన్నం
- దొంగ లేఅవుట్లకు చెక్ పెట్టాలి : జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్
- ముడా చైర్మన్‌గా లక్ష్మణ్‌యాదవ్ ప్రమాణ స్వీకారం

7

నవజాత శిశువుల సంజీవని

- ఏడాదిలోపు చిన్నారులను ఆస్పత్రులకు తరలించేందుకు నియోనేటల్ అంబులెన్సులు
- వాటిలో అత్యాధునిక ఐసీయూ వ్యవస్థ
- ఉమ్మడి జిల్లాలో ఐదు వాహనాలు
- ఏడాది క్రితం ప్రారంభించిన ప్రభుత్వం, 2,905 మందికి సేవలు
- 108కు కాల్ చేయడం ద్వారా సేవల వినియోగం

నవజాత శిశువుల పాలిట నియోనేటల్ అంబులెన్సులు సంజీవనిగా మారాయి. అత్యవసర సమయంలో, అనారోగ్యం బారిన పడిన శిశువులను ఆస్పత్రులకు ఉచితంగా తరలించేందుకు వాటిలో అత్యాధునిక ఐసీయూ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 24 గంటలు అందుబాటులో ఉండే ఈ అంబులెన్సులలో అప్పుడే పుట్టిన శిశువుల నుంచి, ఏడాది వరకు వయసున్న పసిపాపలను ఉచితంగా ఆస్పత్రులకు చేరుస్తాయి. గత ఏడాది ఆగస్టులో ఈ సేవలు ప్రారంభం కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు వేలాది మంది సేవలు పొందారు.

- మహబూబ్‌నగర్ వైద్యవిభాగం(ఆంధ్రజ్యోతి)



సేవలు అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

- వివరాలు 7వ పేజీలో..

మెరుగైన వైద్యం అందిస్తాం

- ఆసుపత్రి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్

ఇంటర్వ్యూ



గద్వాల న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామని, వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని జోగుళాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

ఆసుపత్రిలో డాక్టర్ల కొరత ఉందా?

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 35 మంది డాక్టర్లు ఉన్నారు. కొంత మంది రావాల్సి ఉంది.

గైనిక్ డాక్టర్లు ఉన్నారా..?

ప్రస్తుతానికి నలుగురు ఉన్నారు. నోటిఫికేషన్ వేశాం. త్వరలోనే గైనిక్ డాక్టర్ల కొరతను తీరుస్తాం.

మందుల కొరత ఉన్నదా?

జిల్లాలో అన్ని వ్యాధులకు మందులు ఉన్నాయి. ఎలాంటి కొరత లేదు.

జిల్లాలో ప్రతీ నెలలో ఎన్ని కాన్పులు చేస్తున్నారు?

ప్రతీ నెల దాదాపు 300 దాకా కాన్పులు చేస్తున్నాం. ఇంకా కాన్పుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రజలకు మీరేచ్చే సలహాలు ఏమిటి?

జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల రోగాలకు చికిత్స అందిస్తున్నాం. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బు వృథా చేసుకోవద్దు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధిస్తోంది

- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పదినెలల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యోగులు, ప్రజలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ అన్నదాతలకు సేవలు అందించే 170 ఏఈవోలను ప్రభుత్వం సస్పెండ్ చేసి వేదింపులకు గురిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా రెండు లక్షల ఉద్యోగాలు ఏమోగాని ఉన్న ఉద్యోగులను తొలగిస్తుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో వేసిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి సిగ్గు లేకుండా 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలను వేదిస్తోందన్నారు. ఎన్నికల హామీలు విస్మరించి వయనాడ్ ఉప ఎన్నికల్లో ప్రియాంకగాంధీ గెలుపు కోసం మూటలు మోసేందుకు సిద్ధమైందని ఆరోపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటయ్య, బీఆర్ఎస్ తిమ్మాజిపేట మండల అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బార్డర్ దాటుతోంది..

- సెస్ చెల్లించకుండానే పత్తిని రాయిచూర్ తరలిస్తున్న వ్యాపారులు
- చేతివాటం ప్రదర్శిస్తున్న అధికారులు
- ఆదాయం కోల్పోతున్న మార్కెట్
- నేటికీ కొనుగోళ్లు ప్రారంభించని సీసీఐ

గద్వాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో సాగుచేసిన పత్తి బార్డర్ దాటుతోంది. గద్వాలలో ఇప్పటి వరకు సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో దళారులు ఇక్కడ కొనుగోలు చేసిన పత్తికి సెస్ చెల్లించకుండా కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్ అధికారులు బార్డర్ దాటుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై ఒక శాతం సెస్ వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ పత్తిలోడుతో బార్డర్ దాటుతున్న ఒక్కో వాహనానికి రూ.1000 తీసుకొని వదిలేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో గద్వాల వ్యవసాయ మార్కెట్ ఆదాయం కోల్పోతున్నది. జిల్లాలో నందిన్నె, బల్గెర వద్ద అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఉన్నప్పటికీ అధికారులు సెస్ వసూలు చేయలేకపోతున్నారు. ప్రతీ రోజు పదుల సంఖ్యలో పత్తిలోడ్‌తో బొలేరో వాహనాలు బార్డర్ దాటుతున్నప్పటికీ ఒక్క రూపాయి కూడా సెస్ వసూలు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. సోమవారం మాత్రం మార్కెట్ కార్యదర్శి బార్డర్‌లో తనిఖీ చేయడంతో రూ.25వేల ఆదాయం వచ్చింది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో దాదాపు 1,20,597ఎకరాలలో పత్తి సాగు చేశారు. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అంటే దాదాపు 12లక్షల క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.



పత్తి లోడ్‌తో రాయిచూర్ వెళ్తున్న బొలేరో వాహనం

సెస్‌లు వసూలు చేయాలని చెప్పాం

బార్డర్ దాటుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై ఒకశాతం సెస్ వసూలు చేయాలి. మార్కెట్ సెక్రటరీ సోమవారం చెక్‌పోస్టు వద్దకు వెళ్లారు. సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటాం. త్వరలోనే సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తాం. - పుష్పమ్మ, మార్కెటింగ్ అధికారి గద్వాల

ఆ చైర్మన్ మాకొద్దు..

-విండో చైర్మన్‌పై సభ్యుల అవిశ్వాస తీర్మానానికి ఫిర్యాదు



జిల్లా కో ఆపరేటివ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

తిమ్మాజిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గొరిట సింగిల్ విండో చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటికీ సభ్యులు ఆయన మాకొద్దు అంటూ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని బుధవారం నాగర్‌కర్నూల్‌లో డీసీవోకు ఫిర్యాదు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని గొరిట సింగిల్ విండోలో 13మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ఏడుగురు డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టాలని ఫిర్యాదు చేశారు. సింగిల్ విండోలో రూ. రెండు కోట్ల మేర అవినీతి చోటు చేసుకోవడం, దీనికి ప్రధాన కారణం సీఈవో అని తెలిసినప్పటికీ చైర్మన్ పట్టించుకోకపో వడం వల్లే సింగిల్‌విండో అబాసుపాలైందని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా అవిశ్వాసంపై మండలంలో సర్వత్రా చర్చ జరుగుతోంది.

భూమికి పచ్చాని రంగేసినట్టు





వనపర్తి పట్టణంలోని రాజనగరం శివారులో ఉన్న అమ్మ చెరువు కట్ట కింద సాగు చేసిన వరి పైర్లు పచ్చగా కళకళలాడుతున్నాయి. భూమికి ఆకు పచ్చని రంగేసినట్టు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి వరి అధికంగా సాగు చేస్తుండటంతో ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తోంది. మరో రెండు వారాలైతే పంట కోతకొస్తుందని రైతులు చెబుతున్నారు. 'ఆంధ్రజ్యోతి' ఈ దృశ్యాలను బుధవారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, వనపర్తి

జేఎన్‌టీయూ చెంత.. సమస్యల చింత

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితులు నెలకొన్నాయి. వసతుల లేకపోవడం వల్ల ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో నిండటం లేదని తెలుస్తోంది. వాస్తవానికి జేఎన్‌టీయూలోని ఏదైనా బ్రాంచ్‌లో సీటు వచ్చిందంటే విద్యార్థులు ఎగిరి గంతేస్తారు. ఇందుకు ఆ స్థాయిలో విద్య అందడమే కారణం. కానీ వనపర్తి ఇంజనీరింగ్ కాలేజీలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఉన్నత విద్యాశాఖ, జేఎన్‌టీయూ అధికారులు దృష్టి సారించకపోతే యూనివర్సిటీకి చెడ్డపేరు రావడం ఖాయంగానే కనిపిస్తోంది.

శాశ్వత భవనంపై దృష్టి ఏదీ

వనపర్తికి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీకి 2022 జనవరి మూడో తేదీన జీవోఎంఎస్ 1 ద్వారా మంజూరైంది. శాశ్వత భవన నిర్మాణాలకు సమయం పట్టే అవకాశం ఉన్నందున పాలమూరు యూనివర్సిటీకి సంబంధించిన పీ జీ సెంటర్‌లో తాత్కాలికంగా అదే సంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకుని, తరగతులు ప్రారంభించారు. ఈ కాలేజీలో మొత్తం ఐదు కోర్సులు ఉన్నాయి. సివిల్(సీఈ), మెకానికల్(ఎంఈ), ఎలక్ట్రానిక్స్&కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(ఏఐ, ఎంఎల్ (సీఎస్ఎం)) కోర్సులకుగాను 60 సీట్ల చొప్పున మొత్తం 300 సీట్లను భర్తీ చేసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం మూడో సంవత్సరం అడ్మిషన్లు పూర్తి కాగా.. 900 మంది విద్యార్థులకు గాను 720 మంది మాత్రమే ఉన్నారు. అయితే శాశ్వత భవనం కోసం వనపర్తి శివారులోని మర్రికుంటలో 45 ఎకరాల స్థలం కేటాయించారు. శాశ్వత భవనం, హాస్టల్ భవనాల నిర్మాణం కోసం గత ప్రభుత్వంలోని మంత్రులు శంకుస్థాపన చేశారు. ఎలాంటి బడ్జెట్ అప్రూవల్ లేకపోవడంతో ఇప్పటివరకు భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో తరగతి గదుల కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుత పీజీ కాలేజీలో కేవలం ఐదు గదులు మాత్రమే కేటాయించారు. మొత్తం ఐదు బ్రాంచులు, మూడు సంవత్సరాలకు కలిపి 720 మంది ఉన్నారు. తరగతులకు ఇబ్బంది అవుతుండటంతో.. అక్కడికి దగ్గర్లోనే ఒక భవనాన్ని నెలకు రూ.70 వేలకు అద్దెకు తీసుకున్నారు. అలాగే ఇంజనీరింగ్ అంటే ల్యాబులు, వర్క్‌షాపులు కచ్చితంగా ఉండాలి. కాలేజీ అధికారుల ప్రకారం మొదటి, రెండో సంవత్సరం వరకు ల్యాబులు, వర్క్‌షాపులు ఉన్నాయి. మూడో సంవత్సరం వారికి లేవు. ఉన్న వాటిల్లో కూడా కావాల్సిన వసతులు లేవని, అందువల్ల ప్రాక్టికల్స్ చేయడం సాధ్యం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. అటు శాశ్వత భవనం, ఇటు ల్యాబులు లేక విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు.

హాస్టళ్లు, ఆహారం అధ్వానమే

ఇంజనీరింగ్ కాలేజీతోపాటే ప్రారంభమైన మెడికల్ కాలేజీకి ఇప్పటికే హాస్టళ్లు అందుబాటులోకి వచ్చాయి. శాశ్వత భవనాలు కూడా కొలిక్కి వస్తున్నాయి. ల్యాబులు అన్నీ అందుబాటులో ఉన్నాయి. అక్కడ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కానీ ఇక్కడ మాత్రం అసలు అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. అలాగే ఈ కళాశాలలో సీటు దక్కించుకున్న విద్యార్థులకు కచ్చితంగా హాస్టల్ వసతి కల్పించాలి. సుదూర ప్రాంతాల నుంచి కౌన్సెలింగ్ ద్వారా ఇక్కడ సీట్లు పొందుతారు కాబట్టి, వారికి అవి అత్యవసరం. ప్రస్తుతం ఉన్న 720 మంది విద్యార్థుల్లో కేవలం 300 మంది విద్యార్థులకు మాత్రమే హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. బాయ్స్ హాస్టల్‌ను రెండు చోట్ల ఏర్పాటు చేశారు. ఒక హాస్టల్‌ను జిమ్ భవనంలో ఉంచారు. ఒక్కో గదికి నలుగురి నుంచి ఐదుగురు విద్యార్థులను ఉంచామని అధికారులు చెబుతున్నప్పటికీ.. అంతకంటే ఎక్కువ మందిని ఉంచుతుండటంతో ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. గర్ల్స్ హాస్టల్‌ను గతంలో ప్రైవేటు ఆస్పత్రికి వినియోగించుకున్న భవనంలో ఏర్పాటు చేశారు. కనీసం దాన్ని హాస్టల్‌కు అనుగుణంగా మార్పులు చేయకపోవడం గమనార్హం. అక్కడ దుర్వాసన, రక్తం మరకలు వంటి వాటితో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక మెస్ విషయానికి వస్తే నెలకు రూ.2,500 చొప్పున విద్యార్థులే చెల్లిస్తున్నప్పటికీ.. నాణ్యమైన భోజనం అందడం లేదు. పప్పులో వెంట్రుకలు, సాంబార్లో బొద్దింకలు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. హాస్టళ్లలో బాత్‌రూంలు సరిగా లేవని, ఉన్నవి కంపు కొడుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. మెడికల్ కాలేజీపై ఉన్న శ్రద్ధ తమపై లేదని, తమకూ అన్ని సౌకర్యాలు కావాలని కోరుతున్నారు.

హాస్టల్‌ను మార్చాలి



అమ్మాయిల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని వేరే భవనంలోకి మార్చాలి. గతంలో అక్కడ ఆస్పత్రిని నిర్వహించారు. హాస్టల్‌కు అప్పగించేటప్పుడు కనీసం శుభ్రపర్చకుండా.. పెయింట్లు వేయకుండా అలాగే ఇచ్చారు. అక్కడ కంపు భరించలేక పోతున్నాం. గోడలపై రక్తపు మరకలు ఉండటం తో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కనీస వసతుల కోసం మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు.

- హారిక, సీఎస్ఈ మొదటి సంవత్సరం

బాత్‌రూంలు సరిగా లేవు



వసతి గృహాల్లో బాత్‌రూంలు కూడా సరిగా లేవు. కంపుకొడుతున్నాయి. ఇంజనీరింగ్ కాలేజీ అంటే గొప్పగా ఉండాలి. భోజనం నాణ్యంగా ఉండి, వసతి సరిగా ఉంటేనే చదవాలనిపిస్తుంది. సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా చలనం లేకుండా పోయింది. వచ్చే సంవత్సరం ఎవరైనా వనపర్తి ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్తున్నామంటే నేను వెళ్లొద్దని చెప్తాను.

- దినేష్, సీఎస్ఈ రెండో సంవత్సరం

పాఠశాల ఇలా..
చదువు కొనసాగేదెలా?

» శిథిలావస్థకు చేరిన బిల్లకల్ ప్రాథమిక పాఠశాల భవనం

» ఆందోళన చెందుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


బల్మూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే పాఠశాల శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. బడి ఇట్లా ఉంటే చదువు సాగేదెలా అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని బిల్లకల్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది. అసలే వానాకాలం కావడం, భవనం శిథిలావస్థలా నుండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఒకే ఉపాధ్యాయుడితో కొనసాగుతున్న ఈ బడిలో ప్రస్తుతం ఎనిమిది మంది విద్యార్థులే ఉన్నారు. బడి పరిస్థితిని చూసి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నట్లు కొందరు గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏమైనా జరిగితే దిక్కెవరు ?

బడి కూలిపో యేందుకు సిద్ధంగా ఉంది. ఇందులో చదువుకుంటున్న మా పిల్లలకు ఏమైనా జరి గితే దిక్కెవరు. ప్రజాప్రతినిధులు, అధికా రులు తక్షణమే స్పందించాలి. భవనానికి మరమ్మతులు చేపట్టాలి. నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- నిమ్మల లింగయ్య, గ్రామస్థుడు





శిథిలావస్థలో ఉన్న పాఠాల భవనంలో పాఠాలు చెప్తున్న ఉపాధ్యాయుడు

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

» మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

» కల్వకుర్తిలో ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్‌మీట్ ప్రారంభం

కల్వకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కోరారు. కల్వకుర్తి పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకులంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా 2024-25 స్పోర్ట్స్‌మీట్ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో ప్రతిభ చాటి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం సైతం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. క్రీడల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13జట్లు పాల్గొన్నాయి. ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి అలీ, ప్రిన్సిపాళ్లు నాగమణి, ఉషారాణి, మాజీ ప్రిన్సిపాల్ కేశవులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న చైర్మన్ ఎడ్మ సత్యం

సుంకేసుల జలాశయానికి 1.09 లక్షల క్యూసెక్కుల వరద

రాజోలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి బుధవారం 1.09 లక్షల క్యూసెక్కుల వరద నీరు పోటెత్తింది. ఎగువన గురుస్తున్న వర్షాల కారణంగా జలాశయానికి 1.09 లక్షల క్యూసెక్కులు రావడంతో డ్యాం నుంచి 25 గేట్లు తెరిచి 1.06 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారని డ్యాం జేఈ రాజు తెలిపారు. సుంకేసుల డ్యాం నీటి సామర్థ్యం 292.00 కాగా, ప్రస్తుతం 291.30 మీటర్లుగా నమొదైంది. నీటి నిల్వ 1.20 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.954 టీఎంసీ ఉందని, కర్నూలు కేసీ కెనాల్‌కు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం జేఈ తెలిపారు. ఈ వరద మరో వారం రోజులు కొనసాగే అవకాశం ఉందని, మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు.



సుంకేసుల నుంచి విడుదలవుతున్న నీరు

శెభాష్ జయమ్మ

- ఉత్తమ పోలీస్ రిసెప్షనిస్ట్‌గా ఎంపిక
- డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం

2018లో పోస్టింగ్

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం తిరుమలాపూర్‌కు చెందిన జయమ్మ 2017లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. 2018 ఫిబ్రవరి ఒకటిన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో ఐదు నెలలు పని చేశారు.

ఆ తర్వాత మహ్మదాబాద్‌లో ఐదేళ్ళు విధులు నిర్వర్తించారు. 317 జీవో ద్వారా మహబూబ్‌నగర్‌కు కేటాయించబడ్డారు. ఆ తరువాత జిల్లా పోలీసు కార్యాలయంలో ట్రిపుల్ సీ విభాగంలో ఐదు నెలలు పని చేశారు. ఈ ఏడాది మార్చి ఎనిమిది నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నారు. తాను రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికవడం ఎంతో ఆనందంగా ఉందని జయమ్మ అంటున్నారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఈ ఆరేళ్లలో ఎక్కడ పనిచేసినా, ఉన్నతాధికారుల సహకారంతో రిసెప్షనిస్ట్‌గా బాధ్యతగా, ఇష్టంగా విధులు నిర్వర్తిస్తున్నానని చెప్పారు.



ఫిర్యాదు రాస్తున్న జయమ్మ(ఫైల్)

పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఎవరు స్టేషన్‌కు వెళ్లినా, ముందుగా రిసెప్షనిస్టును కలవాల్సి ఉంటుంది. వారు సమస్యను పూర్తిగా విని పిటిషన్ తీసుకొని, సంబంధిత అధికారులను కలిపిస్తారు. ఈ విధులను పాలమూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షనిస్టుగా పని చేస్తున్న కానిస్టేబుల్ జయమ్మ సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడే తీరు.. వారికి మనో ధైర్యం కల్పించేలా వ్యవహరించే పద్ధతి ఆమెకు రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చింది. ఉత్తమ పోలీసు రిసెప్షనిస్టుగా ఎంపికయ్యారు. డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి

మహబూబ్‌నగర్, అక్టోబరు 23 : పోలీస్ ఠాణా మెట్టెక్కాలంటేనే సామాన్య జనం గజగజ వణికిపోతుంటారు. అన్నీ తెలిసిన వారికి సైతం అక్కడికి వెళ్లాలంటే లోపల ఎక్కడో బెరుకు ఉంటుంది. ఎస్ఐ, సీఐలను కలవాలంటే ముందుగా రిసెప్షనిస్టుతో మాట్లాడాల్సి ఉంటుంది. వారు దురుసుగా మాట్లాడతారని, కనీస గౌరవం కూడా ఇవ్వరని ప్రజల్లో అపోహలున్నాయి. కానీ పాలమూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్ తీరు అందుకు భిన్నంగా ఉంటుంది. ఆమె నోటి వెంట వచ్చే అమ్మా! అనే పిలుపు వచ్చిన వారిలో భయాన్ని మాయం చేస్తోంది. ఆమెతో మాట్లాడితే సగం సమస్య తీరిన భావన కలుగుతుంది. ఆమె విధుల్లో ఉందంటే ఫిర్యాదుదారులకు కొండంత ధైర్యం. ఫిర్యాదుదారులతో ఓపికగా మాట్లాడి, సమస్యను తెలుసుకుంటారు. వారి నుంచి ఫిర్యాదు తీసుకుంటారు. రాయలేని వారైతే తానే స్వయంగా ఫిర్యాదు రాసి, వచ్చిన వారిని మర్యాద పూర్వకంగా సంబంధిత అధికారి వద్దకు తీసుకెళ్తారు. సాధ్యమైనంత వరకు బాధితుల సమస్య పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తారు. అవసరమైనపుడు వారిని స్టేషన్‌కు పిలిపించడం, తిరిగి వెళ్లేటపుడు అదే పద్ధతిలో సాగనంపుతారు. పోలీసు శాఖలో రిసెప్షనిస్టుగా ఆమె అందిస్తున్న సేవలకు తగిన గుర్తింపు లభించింది. రాష్ట్ర స్థాయి ఉత్తమ పోలీసు రిసెప్షనిస్ట్‌గా ఎంపికయ్యారు. పిర్యాదుదారుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకొని, పోలీస్ శాఖలోని మూడు, నాలుగు స్క్వాడ్‌లు వివిధ కోణాల్లో పరిశీలించి ఆమెను రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపిక చేశారు.

రాష్ట్రంలో ఐదుగురు ఉత్తమ రిసెప్షనిస్టులను ఎంపిక చేయగా, వారిలో జయమ్మ ప్రథమ స్థానంలో నిలిచి, ఇటీవల డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా ఎస్పీ జానకి గౌరవంగా సత్కరించారు.



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ జయమ్మ

క్రీడా సమాహారం
క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజం

» ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి



క్రీడాకారులు పరిచయం చేసుకుంటున్న దృశ్యం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని జిల్లా క్రికెట్ సంఘం చీఫ్ ప్యాట్రన్ అన్నారు. బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. బుధవారం గద్వాల, నాగర్‌కర్నూల్ జట్ల మధ్య మ్యాచ్ మనోహర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ టోర్నీలో ఆయా జట్ల క్రీడాకారులు ప్రతిభ చాటి ఉమ్మడి జట్టుకు ఎంపిక కావాలన్నారు. రంజీ స్థాయికి జిల్లా క్రీడాకారులు ఎదగాలని ఆకాంక్షించారు. జరిగిన మ్యాచ్‌లో గద్వాల, నాగర్‌కర్నూల్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగింది. చివరగా టైగా ముగిసింది. నాగర్‌కర్నూల్ జట్టులో తరుణ్ (72పరుగులు) అర్ధసెంచరీ చేయగా, గద్వాల జట్టులో దేవి 66 పరుగులు చేసి రాణించాడు. ఎండీసీఏ ప్రతినిధులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

అండర్-14,17 ఉమ్మడి జిల్లా ఉషూ జట్ల ఎంపికలు

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 29న అండర్-14, 17 ఉమ్మడి జిల్లా బాల,బాలికల ఉషూ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని, బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో రావాలని సూచించారు.

పీయూలో బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



పీయూలోని ఇండోర్ స్టేడియంలో యూజీ డైరెక్టర్ డాక్టర్ అంకం భాస్కర్‌తో ఎంపికైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్ పోటీలలో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీలో బాస్కెట్‌బాల్ పురుషుల క్రీడాకారులను బుధవారం పీయూ ఇండోర్ స్టేడియంలో ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు పాలమూరు యూనివర్సిటీలోని అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి పీయూ పీడీలు, సెలక్షన్ కోచ్‌లు ఎంపిక జరిపి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడకారులను బెస్ట్ 12మందిని ఎంపిక చేశారు. ఈ ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి బెంగళూరులోని కిస్ట్ యూనివర్సిటీలో జరుగు ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్ బాల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పీడీ డాక్టర్ సత్యభాస్కర్ రెడ్డి, బాస్కెట్ బాల్ కోచ్ ఇలియాజ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు బాలికల ఎంపిక



విద్యార్థికి మెమొంటో అందిస్తున్న హెచ్‌ఎం వెంకటయ్యగౌడ్

మక్తల్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి పాఠశాలలో 19న జరిగిన ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీల్లో మక్తల్ మండలం కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు శశిరేఖ, శివానీ పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్యగౌడ్, కోచ్, పీడీ బి.రూప తెలిపారు. బుధవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను శాలువాతో సన్మానించి మెమొంటో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన శశిరేఖ, శివానీలు ఈనెల 28 నుంచి 30వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరుగు 43వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి పది కిలోమీటర్ల రోడ్‌స్పీడ్ సైక్లింగ్ పోటీల్లో మల్లేశ్వరీ, హారిక, జైత్రలు పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు నవంబర్ 4 నుంచి 6వరకు జనగామలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

జీహెచ్‌ఎంల సస్పెన్షన్‌పై
పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన నాయకులు

» సస్పెన్షన్‌పై పునఃపరిశీలించాలి: ఆర్జేడీ కార్యాలయంలో ఏడీకి వినతి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదకొండు మంది జీహెచ్‌ఎంల స్పౌజ్ పాయింట్ల విషయంలో తప్పిదాలు చేశారన్న విషయంలో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. దీనిపై తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి జిల్లా టీఎస్‌ఏజీహెచ్‌ఎంఏ అధ్యక్షుడు జగదీష్‌కుమార్, నాయకులు కురుమూర్తి, అనంతప్ప, సస్పెన్షన్‌కు గురైన జీహెచ్‌ఎంలు హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డిని బుధవారం కలిసి పునఃపరిశీలించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి తప్పు చేయకుండా పారదర్శకంగా ఉంటే అలాంటి వారికి ఇబ్బంది లేదని ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆర్జేడీకి విన్నవించాలని సూచించినట్లు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అనంతరం ఆర్జేడీ కార్యాలయంలో తెలంగాణ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, యుగేందర్‌రెడ్డి, భూపతి సింగ్, జీహెచ్‌ఎం సంఘం నాయకులు జగదీష్, అబ్దుల్‌హక్, సస్పెండ్ అయిన జీహెచ్‌ఎంలు ఆర్జేడీ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో ఏడీకి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు .



ఆర్జేడీ కార్యాలయంలో ఏడీకి వినతి పత్రం అందజేస్తున్న వివిధ సంఘాల నాయకులు, సస్పెండ్ అయిన జీహెచ్‌ఎంలు

ఉపాధ్యాయుల్లో గుబులు

స్పౌజ్ పాయింట్ల తప్పిదాలు చేసిన జీహెచ్‌ఎంలు జిల్లాలో 11 మంది సస్పెండ్ కావడంతో ఉపాధ్యాయుల్లో గుబులు మొదలైంది. జూలై నెలలో జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో కొందరు స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్లు స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయుల ఫైల్స్ తెరపైకి తీసుకువస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫైల్స్‌ను డీఈవో రవీందర్ పరిశీలించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఇప్పటికే స్పౌజ్ పాయింట్ల తప్పిదాల ఆరోపణలు ఉన్న ఉపాధ్యాయులకు మహబూబ్‌నగర్, జడ్చర్ల తదితర మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆరోపణలు ఉన్న ఉపాధ్యాయుల నుంచి ఇప్పటికే వివరణ కూడా కోరారు. ఇందుకు గాను విద్యాశాఖ కమిటీలు కూడా వేసింది. కమిటీ సభ్యులు త్వరగా రిపోర్టు ఇవ్వాలని ఇప్పటికే డీఈవో ఆదేశించారు. దీని ఆధారంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచర్లు తప్పని తేలితే చర్యలు తీసకునే అవకాశం ఉందని డీఈవో తెలిపారు .

వైద్యసిబ్బంది అని బురిడీ

» ఉద్యోగాల పేరుతో ఫోన్‌లో డబ్బులు డిమాండ్ చేస్తున్న గుర్తు తెలియని దుండగులు

» ఫిర్యాదు చేసిన వైద్యసిబ్బంది

గద్వాల క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో ఏఎన్‌ఎంల పోస్టుల విషయంలో ఉద్యోగిలిప్పిస్తానని మొత్తం రూ. 50 ఇవ్వాలని, అందులో మొదట రూ. 25వేలు చెల్లించాలని అభ్యర్థులకు చెబుతున్న సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి బాధితులు, వైద్యసిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నా పేరు ఆంజనేయులు అని, వైద్యశాఖలో విధులు నిర్వహిస్తున్నానని చెబుతూ... "అరుణ అనే యువతికి ఏఎన్‌ఎం పోస్టు రావాలంటే నాకు మొత్తం రూ. 50 వేలు ఇవ్వాలని, మొదట రూ. 25వేలు ఇచ్చి, తర్వాత ఉద్యోగం వచ్చాక మరో రూ. 25వేలు ఇవ్వాలని" ఫోన్‌లో అరుణ అన్న ఉత్తమ్‌కుమార్‌కు ఫోన్ వచ్చింది. అయితే ఇది ఫేక్ లేదా నిజమా అని అతడు వైద్యశాఖలో పనిచేస్తున్న తన మిత్రుడు కృపకు సమాచారం ఇచ్చాడు. అతను వెంటనే డీడీఎం(డిస్ట్రిక్ట్ డాటా మేనేజర్) రామాంజనేయులుకు సమాచారం ఇచ్చాడు. అయితే ఆంజనేయులు అనే వ్యక్తి చేసిన ఫోన్ నంబర్‌కు డీడీఎం ఫోన్ చేసి ఎవరు నీవు.. ఎక్కడ పనిచేస్తున్నావు అని గద్దించేసరికి నానా బూతులు తిట్టడం జరిగిందన్నారు. అయితే ఇది ఫేక్ న్యూస్ అని గ్రహించి ఆయన పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. అలాగే సాయంత్రం కలెక్టరేట్‌లోని ఓ శాఖలో పనిచేసే ప్రకాష్ అనే వ్యక్తికి కూడా ఆంజనేయులు అనే పేరుతో అదే వ్యక్తి ఫోన్ చేసి మీకు ఉద్యోగం రావాలంటే వెంటనే నా ఖాతాలో రూ. 50 వేలు డబ్బులు వేయాలని కోరాడు. అయితే ప్రకాష్ వెంటనే ఈ విషయాన్ని డీడీయంకు తెలుపగా ఇదంతా ఒట్టి మోసం, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించినట్లు డీడీఎం రామాంజనేయలు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

● ఈ విషయంపై పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆంజనేయులకు సంబంధించిన ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేస్తున్నామన్నారు.

ఉద్యోగాలిప్పిస్తామని, డబ్బులు ఇవ్వండని ఎవరైనా అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

జంతు సంరక్షణపై అవగాహన

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐడీవోసీలో బుధవారం హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జంతు సంరక్షణ, జంతు రవాణా, యానిమల్ బర్త్ కంట్రోల్, పెట్ షాప్, డాగ్ బ్రీడింగ్, స్లాటర్ హౌస్ చట్టాలపై ఆ సంస్థ డైరెక్టర్ మౌసావి గుప్త, అడ్వైజర్లు శ్రేయ పరోపకారి, మిషి అగర్వాల్, కోఆర్డినేటర్ అను పోజు తేజవత్ అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హాజరై పలు సూచనలు అందజేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, సహాయ సంచాలకులు, పశువైద్యులు పాల్గొన్నారు.



జంతు సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న హ్యూమన్ సొసైటీ ఇంటర్‌నేషనల్ ప్రతినిధులు

దుఃఖించాలా? ఆనందించాలా?

▸ విపత్కర పరిస్థితిని ఎదుర్కొన్న మహిళ

రాజోలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఒక వైపు అంతులేని దుఃఖం.. మరో వైపు అమిత ఆనందం.. కంటి నిండా ఏడవాలో, గుండె నిండా సంతోషించాలో తెలియని విపత్కర పరిస్థితి ఓ మహిళకు ఎదురయ్యింది. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం తుమ్మలపల్లిలో ఈ ఉదంతం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కొత్తకోట శివ మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై తుమ్మలపల్లి నుంచి పాత రాజోలికి బయలుదేరాడు. దారిలో వాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు ఆయనను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి తర్వాత ఒంటి గంటకు మృతి చెందాడు. అయితే గర్భిణి అయిన అతడి భార్య లక్ష్మి కాన్పు కోసం మంగళవారం ఉదయం అదే ఆసుపత్రిలో చేరింది. రెండు గంటల సమయంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. భర్త మృతి విషయం ఆ తర్వాత కొద్దిసేపటికి ఆమెకు తెలిసింది. అందుకు దుఃఖించాలో, బిడ్డ పుట్టినందుకు ఆనందించాలో అర్థంకాని సందిగ్ధ పరిస్థితిలో ఆమెతో పాటు కుటుంబ సభ్యులు ఉన్నారు. ప్రమాద సంఘటనపై అతడి తండ్రి మద్దిలేటి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు

▸ జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీశైలం
▸ పది మంది బాల కార్మికులకు విముక్తి

తాడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పత్తి చేన్లలో పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీశైలం హెచ్చరించారు. బాలల సంరక్షణ అధికారి, చైల్డ్‌లైన్ - 1098, పోలీస్ శాఖ, కోనేరు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు, నాగర్‌కర్నూల్ - కల్వకుర్తి రహదారిపై తనిఖీలు నిర్వహించారు. తాడూరు ఎస్ఐ గురుస్వామి సహకారంతో తనిఖీ చేస్తుండగా, పత్తి చేనులో పని కోసం పిల్లలను తీసుకెళ్తున్న వాహనాలను పట్టుకున్నారు. అందులో పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామానికి చెందిన ఆరుగురు, సాతాపూర్ గ్రామానికి చెందిన ఒక బాలిక, కోడేరు మండల పరిధిలోని ఏదుల గ్రామానికి చెందిన మరో బాలిక, నాగర్‌కర్నూల్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు బాలలకు విముక్తి కల్పించారు. వారిని నాగర్‌కర్నూల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పిలిపించి అవగాహన కల్పించారు. పిల్లలను బడికి పంపించాలని సూచించారు. అలాగే వాహనాల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సూపర్ వైజర్ సురేశ్, పోలీస్ కానిస్టేబుళ్లు వెంకటేశ్, రమేశ్, స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, అడిషనల్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ యాదవ్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో విద్యుత్ ఉత్పత్తి


దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిర్దేశించిన లక్ష్యానికి చేరువలో జల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోందని ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో 330 మిలియన్ యూనిట్లు, దిగువ జూరాల విద్యుత్ కేంద్రంలో 290 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో 301.574 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో 283.310 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. గడిచిన 24 గంటలలో ఎగువ జూరాలలో 3.920, దిగువ జూరాలలో 4.352 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అయినట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాన్ని రెండు రోజుల్లో అధిగమించే అవకాశం ఉందని చెప్పారు. వరద ఇలాగే కొనసాగితే ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లోని 11 యూనిట్లు ద్వారా విద్యుత్తి చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.



నవజాత శిశువులకు సంజీవని

ఆపదలో అండగా నియోనేటల్ అంబులెన్సులు

నవజాత శిశువుల రక్షణకు నియోనేటల్ అంబులెన్సులు అండగా నిలుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులో వీటిని అందుబాటులోకి తెచ్చింది. అప్పుడే పుట్టిన పిల్లలకు అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఉచితంగా హైదరాబాద్‌లోని నీలోఫర్‌తో పాటు, ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి.

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) అక్టోబరు 23 : తల్లి గర్భంలో తొమ్మిది నెలలు భద్రంగా ఉన్న శిశువు బయటకు వచ్చిన తర్వాత కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఆ సమయంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాల్సి వస్తే తల్లిదండ్రుల బాధలు వర్ణనాతీతం. అన్ని సౌకర్యాలున్న అంబులెన్స్‌లో తరలించాలంటే ఖర్చుతో కూడుకున్న పని. అందుకోసం పేదలు పడే కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నియోనేటల్ కేర్ అంబులెన్సులను అందుబాటులోకి తెచ్చింది. వాటిలో అత్యాధునిక ఐసీయూ వ్యవస్థతో పాటు, నవజాత శిశువును కాపాడేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉంటాయి. గత ఏడాది ఆగస్టులో ప్రారంభమైన ఈ అంబులెన్సులలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,905 మంది సేవలు పొందారు. అంటే ఇన్ని వేల మంది నవజాత శిశువుల ప్రాణాలను ఇవి కాపాడాయి.

24 గంటలు అందుబాటులో...


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులో నియోనేటల్ కేర్ అంబులెన్సులను అందుబాటులోకి తెచ్చింది. ఇవి 24 గంటలు అందుబాటులో ఉంటాయి. అప్పుడే పుట్టిన నవజాత శిశువుల నుంచి, ఏడాది వయసు వరకు ఉన్న పసిపాపలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా 108కు ఫోన్ చేస్తే వెంటనే అంబులెన్స్ అక్కడికి చేరుకుంటుంది. అందులో శిక్షణ పొందిన సిబ్బంది ఉంటారు. వారు పసిబిడ్డకు అవసరమైన వైద్య సేవలను అందిస్తూ హైదరాబాద్‌లోని నిలోఫర్‌తో పాటు, ఇతర చిన్నపిల్లల ఆసుపత్రులకైనా ఉచితంగా తీసుకెళతారు.

అవసరమైన అన్ని సదుపాయాలు

నియోనేటల్ అంబులెన్సులలో అత్యాధునికమైన ఐసీయూ వ్యవస్థ ఉంటుంది. ఆసుపత్రిలోని ఐసీయూ విభాగంలో ఉండే అన్ని సౌకర్యాలు, సదుపాయాలు ఇందులో ఉంటాయి. ఆసుపత్రికి చేరుకునేలోపు శిశువుకు అవసరమైన వెంటిలేటర్, మానిటర్, సిరంజీ ఇన్‌ఫ్యూజన్ పంపు, వ్యాల్యూమ్ ఇన్‌ఫ్యూజన్ పంపు, రెండు రకాల ఆక్సిజన్ సిలిండర్లు, ఎల్ఎంపి సక్షన్ ఆపరేటర్, బీపీ మానిటర్, పల్స్ ఆక్సిమీటర్, ఆటోమేటిక్ ఎక్స్ట్రనల్ డి ఫైబ్రిలేటర్ (ఏఈడి), అంబు బ్యాగ్స్ న్యూబార్న్ వార్మర్ తదితర యంత్రాలు, పరికరాలు ఉన్నాయి. ఇన్ని సౌకర్యాలున్న అంబులెన్స్‌లు ప్రైవేట్‌వి అయితే హైదరాబాద్‌కు శిశువును తీసుకెళ్లేందుకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. అంత ఖర్చు భరించడం పేద ప్రజలకు కష్టతరం. వారిని ఆదుకునేందుకు అందుబాటులోకి తెచ్చిన నియోనేటల్ అంబులెన్సులు ఉచితంగా సేవలందిస్తున్నాయి.

ఉమ్మడి పాలమూరులో ఐదు అంబులెన్సులు

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్, నారాయణపేట జిల్లాల్లో ఐదు నియోనేటల్ కేర్ అంబులెన్సులు ఉన్నాయి. ఈ అంబులెన్సుల ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది సెప్టెంబరు వరకు 2,905 మంది సేవలు పొందారు. అందులో మహబూబ్‌నగర్ - 709, నాగర్‌కర్నూల్ - 568, వనపర్తి - 665, గద్వాల్ - 519, నారాయణపేట - 444 మంది శిశువులకు సేవలిందించారు.


అంబులెన్స్‌లోని అత్యాధునిక ఐసీయూ



సద్వినియోగం చేసుకోవాలి

అత్యవసర పరిస్థితుల్లో 108 నంబర్‌కు ఫోన్ చేస్తే మేము స్పందిస్తున్నాం. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు ఎక్కడి నుంచైనా శిశువును నిలోఫర్, ఇతర ఆసుపత్రులకు తీసుకెళ్తున్నాం. శిశువు ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా ఈ అంబులెన్సుల్లో ఐసీయూ వ్యవస్థ అందుబాటులో ఉంది. 24 గంటలు అందుబాటులో ఉంటుంది. ఉచితంగా అందించే ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

- రవికుమార్, ఉమ్మడి జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్

వరిపై దోమ పోటు

ఆందోళనలో అన్నదాతలు

కొత్తకోట, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)23 : వానాకాలం పంటలు చేతికొచ్చే సమయంలో దోమ పోటుకు గురవుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలు, వాతారణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా తెగుళ్లు సోకుతున్నాయి. ఆకు ఎండు, సుడిదోమ, కంకినల్లి తెగుళ్ల అధికంగా వేదిస్తున్నాయి. దోమను గమనించిన రైతులు వ్యవసాయ కార్యాలయం, మందుల దుకాణాల వైపు పరుగెత్తుతున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు రైతులు మందులు పిచికారి చేస్తుండగా వారం రోజులకు మళీ తెగుళ్ల అనవాళ్లు కనబడడంతో ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో లక్ష 85 వేల ఎకరాల్లో వరి సాగు ..

జిల్లాలో జూరాల, రామన్‌పాడ్, సరళాసాగర్, భీమా ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటల కింద 1.85 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. రోహిణి కార్తెలో నార్లు పోసిన పంటలు కోతకు రాగా.. ఆరుద్ర కార్తెలో నార్లు పోసిన పంటలు పాలకంకి దశలో ఉన్నాయి. వర్షాల కారణంగా కోతలు కోయాల్సి ఉన్నా ఆకాశంలో ఏర్పతున్న మబ్బులకు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పాలకంకి దశలో ఉన్న పైరును కంకినల్లి, ఆకునల్లి, దోమ వదలడం లేదు.



భయపెడుతున్న దోమ ..

ప్రతీ వానాకాలంలో సాగుచేసే పంటలు కోత సమయంలో దోమపోటు భయపెడుతుంది. పంటలకు బాగ వచ్చాయని ఓ పక్క సంతోషం పడుతుంటే మరోపక్క దోమ విపరీతంగా సోకి పంటలను నాశనం చేస్తున్నాయి. ఈ సీజన్‌లో వర్షాలు ముగిసిన తర్వాత మళ్లీ వానలు పడటంతో పంటలకు తెగుళ్ల అధికమయ్యాయి.

- మోహన్‌రెడ్డి, రైతు కొత్తకోట

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వరి పంటలకు సోకుతున్న తెగుళ్లకు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వరి పొలంలో రెండు మీటర్లకు ఇరవై సెంటీ మీటర్లు కాలి బాటలు వదలాలి. నత్రజని ఎరువులను మోతాదులో విడతల వారిగా చల్లుకోవాలి. చిరు పొట్టదశ నుంచి పూత దశలో ఉన్న వరి పైర్లకు ఆశించిన దోమకు అధికారుల సూచన మేరకు మందులు పిచికారి చేయాలి.

- దామోదర్ ఏడీఏ, కొత్తకోట


దోమపోటుకు గురైన వరి పైరు



క్రైం కార్నర్

కోళ్ల పందేల స్థావరంపై దాడి, ఏడుగురిపై కేసు

ధరూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి, ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ధరూరు ఎస్ఐ అబ్దుల్ షకూర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని నెట్టెం పాడు శివారులో మంగళవారం రాత్రి కోళ్ల పందేలు ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ధరూరు ఎస్ఐ అబ్దుల్ షకూర్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పది కోళ్లు, మూడు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవి పందిని ఢీకొన్న బైక్, ఇద్దరికి తీవ్ర గాయాలు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి) : వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం అడవి పందిని ఢీకొనడంతో కిందపడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ శివారులో బుధవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలకపల్లి మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన నరేశ్ బైకుపై నాగర్‌కర్నూల్‌కు వస్తుండగా, అదే గ్రామానికి చెందిన వెంకటయ్య లిఫ్టు అడిగి ఎక్కాడు. ఇద్దరూ కలిసి బైక్‌పై వేగంగా వస్తుండగా రోడ్డు పక్కనున్న చెట్ల పొదల్లో నుంచి ఆకస్మాత్తుగా అడవి పంది రోడ్డు పైకి రావడంతో దాన్ని ఢీకొని కిందపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని సమీపంలోని పొలాల్లో ఉన్న రైతులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రూ. 2.45 లక్షలు స్వాహా

ఉప్పునుంతల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల బారిన పడి ఓ వ్యక్తి రూ. 2.45 లక్షలు పోగొట్టుకున్నాడు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన సురేశ్ రెడ్డికి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఉంది. అమేజాన్ పే ఇండియా పేరున అతడి ఖాతాలో నుంచి గత నెల 25 నుంచి 30వ తేదీ వరకు విడుతల వారీగా రూ.2.45 లక్షలు డెబిట్ అయ్యాయి. కానీ ఎలాంటి మెసేజ్‌లు రాకపోవడంతో ఈనెల రెండున గుర్తించాడు. వెంటనే సైబర్ క్రైమ్‌తో పాటు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాజోలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వేడి నీటి కోసం హీటర్ ఆన్ చేయబోయి ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రంలో బుధవారం ఉదయం జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజోలికి చెందిన చెందిన గోవిందమ్మ (50) స్నానానికి వేడి నీళ్లు పెట్టుకునేందుకు వాటర్ హీటర్‌ను ఆన్ చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే శాంతినగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవ పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని ఎక్కమేడు గ్రామానికి చెందిన గాదెపాక చంద్రప్ప (40) మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక సమస్యలు తలెత్తడంతో వారం రోజుల క్రితం భార్యతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి అతడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పులు చేసి చిప్ప చేతికిచ్చారు

▸ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ▸ ముడా చైర్మన్‌గా లక్ష్మణ్‌యాదవ్ ప్రమాణ స్వీకారం


సభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు


సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

మహబూబ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు ఇచ్చామని బీఆర్ఎస్ చెప్పుకోవడం సిగ్గుచేటని, అప్పుల కుప్ప చేసి చిప్ప చేతికి ఇచ్చారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్‌గా లక్ష్మణ్ యాదవ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు జిల్లా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి. జి మధుసూదన్‌రెడ్డి, జనుంపల్లి అనిరుధ్‌రెడ్డిలు ఆయనను చైర్మన్ స్థానంలో కూర్చోబెట్టారు. అనంతరం జేజేఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడారు. పదేళ్ల పాలనపై విసిగిపోయిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేందుకు బీఆర్ఎస్ కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. అడ్డగోలుగా సంపాదించిన బీఆర్ఎస్ పార్టీకి జాతీయ పార్టీలకు కూడా లేనన్ని, బహుషా వెయ్యి కోట్ల నిధులు ఉన్నాయంటే ఏవిధంగా సంపాదించారో అర్థమవుతుందని ఆరోపించారు. మూడుసార్లు కౌన్సిలర్‌గా గెలిచిన లక్ష్మణ్‌యాదవ్ పార్టీ అధికారంలో లేకున్నా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తనతో పాటు కాంగ్రెస్ నుంచి గెలిచిన కౌన్సిలర్లు అందరూ పార్టీ మారినా ఆయన మాత్రం పార్టీనే నమ్ముకొని కొనసాగారన్నారు. పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించే 145 గ్రామాల పరిధి ఉన్న ముడా చైర్మన్‌గా ఆయనకు అవకాశం కల్పించారని చెప్పారు. ఎన్నో ఒడిదుడుకులు ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి, నెలకు ఆరు వేల కోట్ల రూపాయలు అప్పు కడుతూనే, ప్రతీ నెల ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలిస్తున్నారని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నారని తెలిపారు.

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ముడాకు పూర్తి స్థాయి అధికారాలు, నిధులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. నామినేటెడ్ పదవుల్లో సామాజిక సమతుల్యతను కచ్చితంగా పాటిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రూ. 265 కోట్ల అమృత్ నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు.

● జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ ఇది వరకు అక్రమ లేఅవుట్లకు అనుమతిలిచ్చారని, ఎక్కడా 10 శాతం ఓపెన్ ల్యాండ్‌లు లేవన్నారు. బఫర్ జోన్‌లో, చెరువు ల్లోనూ లేఅవుట్లు చేశారని విమర్శించారు. వాటిలో పేదలు ప్లాట్‌లను కొనుగోలు చేశారని, కానీ చర్యలు తీసుకుంటే వారు నష్టపోతారన్నారు. కానీ అక్రమ లేఅవుట్‌లు చేసిన వ్యాపారులు, అనుమతులిచ్చిన అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ అభివృద్ధిపై బీఆర్ఎస్, బీజేపీ అనవసర రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. ఆర్థిక నేరస్తులైన కేటీఆర్, హరీశ్‌రావులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ ఇచ్చి, వారి విజయం కోసం కృషి చేస్తామన్నారు.

● రాజ్యసభ సభ్యుడు అనీల్‌యాదవ్ మాట్లాడుతూ అన్ని కులాలు, వర్గాలకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం ఇస్తోందన్నారు. తనకు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వడమే అందుకు నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న సదర్ ఉత్సవాలకు యాదవ సోదరులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, ఏపీ మిథున్ రెడ్డి, మల్లు నర్సింహారెడ్డి, వినోద్‌కుమార్. సంజీవ్ ముదిరాజ్, సిరాజ్ ఖాద్రి, జహీర్ అక్తర్, చంద్రకుమార్‌గౌడ్, ఎం సురేందర్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్, సీజే బెనహర్, సాయిబాబ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

టాటా ఏస్, కారు ఢీకొని ఒకరి మృతి

కృష్ణ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : టాటా ఏస్, కారు ఢీకొని ఒకరు మృతి చెందారు. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టాటా ఏస్ వాహనం మక్తల్ నుంచి వస్తుండగా, రాయచూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొన్నది. కారులో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడ జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఏఎస్ఐ కతలప్ప తెలిపారు.

పైసలాట స్థావరంపై పోలీసుల దాడి

- పన్నెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మిడ్జిల్, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని మసిగుండ్లపల్లి శివారులో బుధవారం కొందరు పైసలాట ఆడుతుండగా స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేశారు. వారు దూరం నుంచి వస్తుండగానే గమనించి పైసల ఆట ఆడుతున్న వారు అక్కడి నుంచి పరారయ్యారు. వారు వదిలి వెళ్లిన 12 బైక్‌లను స్పెషల్ పార్టీ పోలీసులు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఆ వాహనాలు ఎవరివో వివరాలు సేకరిస్తామని, అనంతరం జిల్లా అధికారుల ఆదేశం మేరకు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ధరూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని ఖమ్మంపాడు సమీపం లోని జూరాల తిరుగు జలాల వద్ద గుర్తు తెలియని మృత దేహం లభ్యమైంది. మృతుడి వయసు దాదాపు 42 సంవత్సరాలు ఉండొచ్చని, ఒంటిపై తెలుపు రంగు జుబ్బా ఉందని ధరూరు ఎస్ఐ అబ్దుల్ షకూర్ తెలిపారు. మృతదేహాన్ని ధరూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని చెప్పారు. అయితే సాయంత్రం అతడు కర్ణాటక రాష్ట్ర రాయచూర్ ప్రాంత వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిసింది.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కోస్గి, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి) : ఎదెరెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. నారాయణపేట జిల్లా గుండుమాల్ మండలంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన కృష్ణ (32) బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఓ బైక్‌ను ట్రయల్‌కు తీసుకెళ్లి వస్తుండగా, ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మానసతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.


సోమశిల వద్ద నిండు నీటితో కళకళలాడుతున్న కృష్ణానది

కృష్ణమ్మ ఒడిలో అందాల విందు

కొల్లాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక ప్రాంతంగా ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న సోమశిల పర్యాటకులకు మరింత కనువిందు చేయనుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల కృష్ణానదిలో కోటి రూపాయలతో తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏసీ లాంచీ ఈ నెల 26 నుండి ప్రారంభం కానుంది. 26వ తేదీ నుంచి సోమశిల టు శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం చేసే పర్యాటకులకు కృష్ణానది సోయగాలు, ప్రకృతి అందాలు, దట్టమైన నల్లమల అడవులు, పురాతన ఆలయాలు, వాటి విశిష్టత మంత్రముగ్ధులను చేయనున్నాయి. లాంచీ ప్రయాణం చేసే ప్రయాణికులకు ఒక్కొక్కరి నుంచి రానుపోను చార్జీ పెద్దవాళ్లకు రూ.3వేలు, పిల్లలకు రూ.2,400లుగా నిర్ణయించారు. కేవలం సోమశిల నుంచి శ్రీశైలం వెళ్లే పర్యాటకులకు సింగిల్ జర్నీ పెద్దవాళ్లకు రూ.2వేలు, పిల్లలకు రూ.1,600లు ధర నిర్ణయించి ఈ ప్యాకేజీలల్లో పర్యాటకులకు మధ్యాహ్న భోజనంతోపాటు స్నాక్స్ టూరిజం వారే అందించనున్నారు. ఏసీ లాంచీలో దాదాపు 50మంది ప్రయాణించేలా అవకాశం ఉంటుందని ఈ అద్భుత అవకాశాలను పర్యాటక ప్రేమికులు వినియోగించుకోవాలని తెలంగాణ టూరిజం అధికారులు వెల్లడించారు.

లింకు రోడ్డు లేక అవస్థలు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- లింకు రోడ్లతో 15 కిలోమీటర్ల మేర తగ్గనున్న దూరం


గుంతలమయంగా మారిన లింకు రోడ్డు

వీపనగండ్ల, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): లింకు రోడ్డు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్క కిలోమీటర్ రోడ్డు లింకు కలిపితే 15 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. ఇలాంటి రోడ్డు అభివృద్ధి చేయడంలో అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. చుట్టూ తిరిగి, చాలా దూరం ప్రయాణించి గమ్యం చేరుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రోడ్లు బాగు చేస్తున్నాం.. రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నాం.. అంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు మండలంలోని తూమకుంట, ఎన్మన్‌బెట్ల రోడ్డుపై దృష్టి పెట్టడం లేదు. ఆర్టీసీ బస్సులు ఎరుగని ఆ రోజుల్లో ఈ ప్రాంత గ్రామాల వెంట ప్రైవేటుకు చెందిన అబ్దుల్ ఖాదర్ బస్సులు తిరిగేవి. అలాంటిది ఆర్టీసీ బస్సులు వచ్చాక.. ఈ బస్సులను రద్దు చేశారు. దీనితో ఆనాటి నుంచి నేటి వరకు ఈ మార్గం గుండా ఎలాంటి బస్సులు తిరగడం లేదు. మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తూమకుంట క్రాస్ రోడ్డు నుంచి ఎన్మన్‌బెట్ల రోడ్డుకు లింకు కలిపితే పెబ్బేరు నుంచి కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, శ్రీశైలం వెళ్లే ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. త్వరగా గమ్యం చేరుకునే అవకాశం ఏర్పడుతుంది. రోడ్డు అభివృద్ధి చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో రోడ్డు మంజూరైందని, ఇప్పుడు అప్పుడు వేస్తామని ప్రతిసారి చెప్పటమే కానీ వేయడం, మరమ్మతులు కూడా చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లింకు రోడ్డును బీటీగా మార్చాలని కోరుతున్నారు.

రోడ్డు వేయాలి



తూముకుంట క్రాస్ రోడ్డు నుంచి ఎన్మన్ బెట్ల రోడ్డు వరకు ఉన్న లింకు రోడ్డుకు నిధులు మంజూరు చేసి బీటీ రోడ్డు వేయాలి. బీటీ అభివృద్ధి చెందితే ఎన్నో గ్రామాల ప్రజలకు రవాణా ప్రయోజనం చేకూరుతుంది. సమయం ఆదా అవుతుంది.

- ప్రవీణ్, ఎన్మన్‌బెట్ల

దూరం తగ్గుతుంది



ఈ రోడ్డు అభివృద్ధి చేస్తే చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండదు. 15 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. ప్రయాణికులు తక్కువ సమయంలో తమ గమ్యస్థానాలకు చేరుకునే వెసులుబాటు కలుగుతుంది.

- రాముడు, వీపనగండ్ల

ఇంటర్వ్యూ..



ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

- శేఖర్‌గౌడ్, ఏపీవో, వీపనగండ్ల

వీపనగండ్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా ఎన్నో పనులు చేపట్టడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కూలీ పని కల్పించడమే ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యమని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏపీవో శేఖర్‌గౌడ్ తెలిపారు.

మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి?

మండలంలో 9,188 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇవ్వగా, 17,858 మంది కూలీలు ఉన్నారు. 5,601 కుటుంబాలకు చెందిన 9,436 మంది కూలీలు ప్రతి రోజు పని చేస్తున్నారు.

ఎలాంటి పనులు చేపడుతున్నారు?

బీడు భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు చదును చేసే పనులు, మిట్ట భూముల్లో వాల్ కట్టలు, పాత బావుల పూడికతీత కూలీలతో పనులు చేపడుతున్నాం.

పండ్ల తోటల పెంపకం చేస్తున్నారా?

ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల పొలాల్లో మామిడి, బత్తాయి, నిమ్మ, అర ఎకరాలో డ్రాగన్‌ఫ్రూట్, ఎకరాల్లో మునగా సాగుకు పూర్తి సబ్సిడీ కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

'రైతు నిరసన' విజయవంతం చేద్దాం

రేవల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కేంద్రంలో 29వ తేదీన తలపెట్టిన రైతు నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు వస్తున్న సందర్భంగా విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రఘు రామరావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో భీమన్న, రాములు, మహమూద్, రామచంద్రయ్య, నరసంహ, అల్తాఫ్, ఖాజా, జానయ్య, రాములు, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ అడ్డగింత

ఖిల్లాఘణపురం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రధాన రహదారులపై ఓవర్ లోడ్‌తో టిప్పర్ వాహనంలో బండరాళ్లను తరలిస్తున్నారు. మండలంలోని షాపూర్‌లో ఓవర్ లోడ్‌తో కర్నె తండాలో మైనింగ్ చేసిన రాళ్లను ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా బాలానగర్ వరకు తరలిస్తున్నారని గ్రామస్థులు బుధవారం అడ్డుకున్నారు. గ్రామంలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద రాళ్లు పడిపోయినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రమాదాలు కాకుండా సంబంధిత అధికారులు వాహనాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. పరిమితికి మించి రాళ్లను రవాణా చేయడంతో బీటీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయని తెలిపారు. బండ రాళ్లు కింద పడిపోకుండా కనీస జాగ్రత్తలు పాటించడం లేదని, వాహనాలు వెళ్లే సమయంలో బాటసారులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

ఫైనాన్స్ నిర్వాహకుడి దౌర్జన్యం

పెబ్బేరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ఓ హోటల్ యజమానిపై ఫైనాన్స్ నిర్వాహకుడు దౌర్జన్యం పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఉడిపి హోటల్ యజమాని ఫైనాన్స్ నిర్వాహకుడితో రూ. 30 వేలు తీసుకున్నాడు. ప్రతిరోజు రూ.300 ప్రకారం వంద రోజుల వరకు చెల్లించాలి. మంగళవారం రోజున ఇచ్చే డబ్బులను యజమాని ఇవ్వకపోగా మరుసటి రోజున రూ.600 చెల్లిస్తానని చెప్పాడు. దీంతో బుధవారం ఫైనాన్స్ నిర్వాహకుడు హోటల్ యజమాని దగ్గరికి వచ్చి డబ్బులు ఇవ్వాలని రాద్ధాంతం చేశాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖిల్లాఘణపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి చెందిన మొల్ల లక్ష్మణ్ (32) ఈనెల 1వ తేదీన ప్రమాదవశాత్తు కింద పడి తలకు గాయం కావడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ గౌడ్ తెలిపారు. తల్లి మొల్ల నారమ్మ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 1న ఇంటి మెట్లు దిగుతుండగా కిందపడి తలకు గాయమైనట్లు తెలిపారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు కవి సమ్మేళనం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు భాష చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న ఉదయం 10 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బడే సాబ్, వనపర్తి ఇన్‌చార్జి నాయకంటి నరసింహ శర్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని బాలుర డిగ్రీ కళాశాలలో కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు.

ఆరోగ్యంగా ఉండే ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలి

- ఎస్పీ రావుల గిరిధర్


రక్తదానం చేస్తున్న ఎస్ఐలను అభినందిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరు ఐదు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. సమాజం, దేశం, రేపటి తరాల భవిష్యత్ కోసం విధి నిర్వహణలో ఎంతో మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. వారి త్యాగ ఫలితమే మనం ప్రశాంత వాతావరణంలో గడుపుతున్నామని చెప్పారు. అనంతరం రక్తదానం చేసిన ఎస్ఐలు మంజునాథ్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, నరేందర్, సురేష్, పలువురిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంతో మంది రక్తం దొరకక ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మొత్తం 123 యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాందాస్ తెజావత్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ కృష్ణ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలి


హోమం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీహరి, సంస్థానాధీశులు శ్రీరాం భూపాల్

అమరచింత అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనను ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని సోదర భావం, శాంతిని పెంపొందించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని నాగల్ కడుమూరులో విశ్వకర్మ జగద్గురు దేవేంద్రచార్య 72వ దివ్య ఆరాధన మహోత్సవాలలో అమ్మపురం సంస్థానాధీశులు శ్రీరాం భూపాల్ ఎమ్మెల్యేతో కలిసి పంచామృతం, అభిషేకం, హోమం, ప్రాణ ప్రతిష్ఠ తదితర పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేవేంద్రచార్య మహాస్వాములు ఆరాధన మహోత్సవం పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సద్గురుల ఆచరణ, వారి మంచిని గ్రహించి ప్రజలు సంస్థానాధీశుల సూచనలు, సలహాలు తీసుకొని ఆలయ అభివృద్ధితో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతుగా సహకరిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేవేంద్ర చార్య మహాస్వాములు చూయించిన మూడు రోజులు కొనసాగిన విశ్వకర్మ జగద్గురు దేవేంద్ర చార్య ఆరాధన మహోత్సవాలు సాయంకాలం అర్చన, డోలారోహణతో ముగిశాయి. పీఠాధిపతులు నరసింహ చార్య స్వామి, గుండెపల్లి నరేష్ ఆచార్యులు, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అయ్యుబ్‌ఖాన్, జగదీశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, చంద్రకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

పెబ్బేరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోమాలపల్లి చెందిన హరికృష్ణ ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం వైద్య ఖర్చులు నిమిత్తం ప్రభుత్వం రూ.లక్ష ఎల్‌వోసీని మంజూరు చేయగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంధం రంజిత్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

తెలుగు సదస్సులో బైరోజు సోదరులకు సన్మానం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్ నగర్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన డా.కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం అంతర్జాతీయ తెలుగు సదస్సులో వనపర్తికి చెందిన బైరోజు చంద్రశేఖర్, బైరోజు శ్యాంసుందర్ పాల్గొని పత్ర సమర్పణ చేశారు. కపిలవాయి లింగమూర్తి వ్యాసాలలో దేవాలయాల ప్రస్తావన, చారిత్రక అంశాలు ప్రసంగించి పత్ర సమర్పణ చేసినందుకు వీరిని సన్మానించారు.

బాధిత కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్థులు

పాన్‌గల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేమద్దుల చెందిన పంచాయతీ వాటర్‌మన్ పత్తికొండ విష్ణువర్ధన్‌రెడ్డి వారం రోజుల క్రితం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్థులు తమకు తోచిన విధంగా చందాలు వేసి రూ.1.50 లక్షలు బుధవారం మృతుడి భార్యకు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో దేవిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, తిరుపతయ్య, దామోదర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు అందుబాటులో ఉందాం'

కొత్తకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించడానికి ముందుందామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలో ఫంక్షన్‌హాల్‌లో మండల, పట్టణ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు ఎల్లప్పుడు న్యాయం జరుగుతుందన్నారు. మదనాపురం మార్కెట్ చైర్మన్ పదవి, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ ఎంపిక చేయడమే దీనికి ఉదాహరణ అన్నారు. అనంతరం గొల్లబాబు, బాదం వెంకటేష్‌లను సన్మానం చేశారు. శ్రీనివాసులు బోయోజ్, కృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, శివరాములు, సాయిలు యాదవ్, ఎజాజ్ కరాటేశ్రీను, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సర్వీసు క్రమబద్ధీకరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు

వనపర్తి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులందరిని క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. 25న చలో సీఎం కార్యాలయం హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని మునిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలలో సుమారు 65వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, డెలీ వైస్, ఫిక్స్ పే తదితర పద్ధతుల్లో కార్మికులు పనిచేస్తున్నారన్నారు. రెండవ పీఆర్సీలో కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. చంద్రయ్య, గడ్డం కురుమయ్య, లాల్, గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

- అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, చిత్రంలో అధికారులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ గిరిధర్ తరపున జిల్లాలోని అన్ని మండలాల స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ పరిధిలో ఉన్న రోడ్డు ప్రమాద స్థలాలను గుర్తించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా వనపర్తి జిల్లా ద్వారా వెళ్తున్న జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను, జిల్లా రహదారులు, మునిసిపాలిటీల్లో గల రోడ్డు ప్రమాదాల స్థలాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. జాతీయ రహదారిపై వెల్టూరు జంక్షన్, పాలెం జంక్షన్, మదర్ థెరిస్సా కొత్తకోట కూడలి, అమడబాకుల, నాటవెళ్లి, తోమాలపల్లి, ఆనంద భవన్ జంక్షన్ పెబ్బేరు, మోడల్ హై స్కూల్ పెబ్బేరు, రంగాపూర్ కూడలిలను ప్రధాన ప్రమాద స్థలాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. గుర్తించిన ఈ బ్లాక్ స్పాట్‌లలో సూచిక బోర్డులు, బ్లింకింగ్ లైట్లు, హై మాస్ట్ లైట్స్, వాహనాల పార్కింగ్ స్థలం వంటివి ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పెళ్లి పెద్దలు, బ్రాహ్మణులకు, ముస్లింలకు పెళ్లి చేసే పెద్దకు, పాస్టర్లకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని, వారు దగ్గరుండి పెళ్లి చేస్తే కేసులు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన కోసం కొత్తకోటలో ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవసరమైన సీసీ కెమెరాలు సమకూర్చుకునేందుకు కలెక్టర్ అవసరమైన మేరకు నిధులు మంజూరు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో భూసేకరణ అంశాలకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గణప సముద్రం రిజర్వాయర్ బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి 197 ఎకరాలకు నవంబరు 20లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, 27 ప్యాకేజీ కింద భూసేకరణ అవార్డు జారీ ప్రక్రియ నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. ఘణపురం బ్రాంచ్ కెనాల్‌లో కర్నె తండా పార్ట్‌లో 171 ఎకరాలు సర్వే కూడా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సన్నరకం వడ్ల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందునాయక్

మదనాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వడ్ల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని సివిల్ సప్లయ్ డీఎం ఇర్ఫాన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మదనాపురం, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత మండలాలకు సంబంధించిన ఐకేపీ, సింగిల్ విండో కొనుగోలు కేంద్రాల సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న రకం గుర్తించడానికి ప్రత్యేక పరికరం ఉందన్నారు. సన్నరకం గింజ పొడవు 6ఎం.ఎం., వెడల్పు 3ఎం.ఎం కన్నా తక్కువ ఉండాలని అన్నారు. గన్ని బ్యాగులకు సెంటర్ కోడ్‌తో పాటు రైతుకు సంబంధించిన కేంద్రాల్లో సన్నరకంతో పాటు దొడ్డు రకానికి వేర్వేరు సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సన్న వడ్ల ఎంపిక సక్రమంగా ఉంటే త్వరలో ప్రజలకు రేషన్ షాపుల ద్వారా అందించే సన్న బియ్యం కూడా మంచి నాణ్యతతో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్, డీఎస్‌వో కాశీనాథ్, ఏఎం బాలునాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

గోపాల్‌పేట, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ కన్వీనర్ గట్టు స్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణలో మొదటి రాష్ట్రమని ప్రకటించిన ముఖ్యమంత్రి ఇప్పుడు వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీలో ఉద్యోగాలు భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు గ్రూప్స్ పరీక్షలు నిర్వహించి డిసెంబర్‌లో ఉద్యోగలను భర్తీ చేసి మాదిగలకు రావాల్సిన ఉద్యోగాలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు ఉద్యోగా భర్తీ నిలిపివేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ నెల 30వ తేదీన జడ్చర్ల లో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభలకు పెద్దఎత్తున మాదిగలు తరలిరావాలని కోరారు. కార్యక్ర మంలో రాజేంద్రర్, చెన్నయ్య, శరత్, శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

ఖిల్లాఘణపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈదమ్మ అన్నారు. మండలంలోని కమలొద్దిన్‌పూర్ పంచాయతీలో బుధవారం బాలల హక్కులపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాల బాలికలపై వేధింపులు, బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థను లేకుండా బాలల సంరక్షణ కమిటీలు శ్రద్ధ వహించాలని అన్నారు. గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీ సభ్యులు బాల్య వివాహాలను కలిసికట్టుగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను చేసినా, ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలలపై అఘాయిత్యాలు జరిగితే 1098, 100 టోల్ ఫ్రీ నెంబర్లకు డయల్ చేయాలన్నారు. బాలల హక్కులను కాపాడడానికి కృషి చేస్తామని గ్రామస్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధి యాదమ్మ, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

వనపర్తి రూరల్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాల యాజమాన్య బృందం మెడికల్ సీట్లు పొందిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు పురేందర్, శశాంక్, వాగ్దేవి, ప్రణతి సింధే, మహిత, పల్లవి, మేఘన, అంజలి, వసంత సీట్లు పొందడంపై శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జగదీశ్వర్, వరప్రసాద్‌రావు, నాగేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్, నాయకంటి నరసింహ శర్మ, విజయ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చాలి

పెబ్బేరు రూరల్: చదువులో రాణించి తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కరస్వామి అన్నారు. బుధవారం మండలంలోని రాంపురం చెందిన వర్ణ ఎంబీబీఎస్ సీటు సాదించడంతో ఘనంగా సన్మానించారు.

బకాయిల వల్లే విద్యార్థులు చదువులకు దూరం



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు, నాయకులు

వనపర్తి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కళాశాలల విద్యార్థులకు ఉపకార వేతనాల బకాయిలు చెల్లించకపోండంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు కళాశాల చదువులకు దూరం అవుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రమేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట కళాశాల విద్యార్థులతో ధర్నా చేశారు. ఉపకార వేతనాల బకాయిలు రూ.7,600 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు కోసం విద్యార్థులను వేధిస్తున్నాయన్నారు. ఇటీవల రూ.1,560 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అరవింద్, భాను ప్రకాష్, చరణ్, గణేష్, జస్వంత్, బన్నీ, శివ యాదవ్, శివ, భాను పాల్గొన్నారు.

అనుమానం ఉన్న చోట తనిఖీలు


కొత్తకోటలో తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

కొత్తకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనుమానం ఉన్న ప్రతి చోటా డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ మంజునాథ్ రెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలో డ్రగ్స్ అనుమానిత ప్రాంతాల్లో భద్రప్ప, శివ పద్మ కాంప్లెక్స్‌లు, బస్టాండ్, మదనాపురం రోడ్డు, మహేశ్వరి లాడ్జి భవన సముదాయంలో పోలీసులు తనిఖీ చేశారు. ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు నార్కొటిక్ డ్రగ్స్‌ను గుర్తించడానికి తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. స్థానిక పోలీసులు కురుమయ్యగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, డాగ్ స్క్వాడ్ టీం ఉన్నారు.

గ్యాస్ ఏజెన్సీపై కేసు నమోదు

మదనాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించని గ్యాస్ ఏజెన్సీపై తూనికలు, కొలతల శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని అజ్జకొల్లు గ్రామంలో గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసే ఆటోను బుధవారం వారు తనిఖీ చేశారు. ఆటోలో బరువు తూచే యంత్రం లేకపోవడంతో గ్యాస్ ఏజెన్సీపై కేసు నమోదు చేశారు. మూడు వేల రూపాయలు జరిమానా విధించారు. సిలిండర్లు సరఫరా చేసే వాహనాల్లో బరువు తూచే యంత్రం తప్పనిసరిగా ఉండాలని లీగల్ మెట్రాలజీ అధికారి సత్యనారాయణ తెలిపారు.

పంట నష్టపరిహారం ఇచ్చేందుకు కసరత్తు


వీపనగండ్ల మండలంలో కోతకు గురైన వరి పంట

పెబ్బేరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు, వరదల తాకిడికి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పరిహారం ఈనెల చివరి వరకు ఖాతాల్లో నేరుగా జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 1,986 ఎకరాలు పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. వరి, కంది, వేరుశనగ, మొక్కజొన్న, పెసలు, జొన్న, మినుములు పంటలకు అధికంగా నష్టం వాటిల్లింది. వనపర్తి, పాన్‌గల్, పెబ్బేరు, శ్రీరంగాపురం, చిన్నంబావి, కొత్తకోట మండలాల్లో ఎక్కువ శాతం పంటలు నష్టం జరిగింది. పెట్టుబడులు పెట్టి సాగు చేసుకుంటున్న పంటలు వర్షాలకు దెబ్బతినడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. 33 శాతం కంటే ఎక్కువగా నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి సమర్పించారు.